
# కుబేర పోస్టర్ విడుదల

**కీలక పాత్రలో అక్కినేని నాగార్జున**




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం కుబేర. ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. అక్కినేని నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా కుబేర గ్లింప్స్ అప్‌డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. గ్లింప్స్‌ను ఇవాళ సాయంత్రం 5:31 గంటలకు విడుదల చేయనున్నట్టు ప్రకటిస్తూ.. షేర్ చేసిన లుక్‌లో ధనుష్, అపార్ట్‌మెంట్స్, బిల్డింగ్స్, నోట్లను చూడొచ్చు. ఈ లుక్ గ్లింప్స్, సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ధైర్యవంతులనే అదృష్టం వరిస్తుంది.. అంటూ చెదిరిన వెంట్రుకలు, మాసిన గడ్డంతో నవ్వుతూ కనిపిస్తున్న ధనుష్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పీ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. సోషల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. కుబేరలో పాపులర్ బాలీవుడ్ యాక్టర్ జిమ్ సర్భ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదల చేసిన జిమ్ సర్భ్ పాత్ర లుక్‌లో.. స్టైలిష్ సూట్‌లో నోట్ల కట్టల మధ్య నిల్చొని ఆసక్తిని రేకెత్తిస్తున్నాడు.

# సాహిబా ప్రేమలో మునిగితేలుతున్న విజయ్



అగ్ర హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం భారీ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన 'సాహిబా' పేరుతో హిందీ మ్యూజిక్ ఆల్బమ్‌లో నటించారు. 'హీరియే..' గీతంతో పాపులర్ అయిన స్వరకర్త, గాయని జస్లీన్ రాయల్ ఈ పాటను కంపోజ్ చేయడం విశేషం. ఈ గీతంలో విజయ్ దేవరకొండకు జోడీగా రాధిక మదన్ నటించారు. సుధాంశు సరియా దర్శకత్వం వహించారు. శుక్రవారం ఈ ఆల్బమ్‌ను విడుదల చేశారు. వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో మెలోడీ ప్రధానంగా ప్రేమలోని సున్నిత భావోద్వేగాల్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. ఇందులో విజయ్ దేవరకొండ ఫొటోగ్రాఫర్‌గా కనిపించారు. 'హీరీయే..' గీతం తరహాలోనే 'సాహిబా' సైతం సంగీత ప్రపంచంలో సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని మ్యూజిక్ డైరెక్టర్ జస్లీన్ రాయల్ ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ పాన్ ఇండియా చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవలే కేరళలో ఓ షెడ్యూల్ జరిగింది. ఈ సినిమాతో పాటు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో పీరియాడిక్ చిత్రంలో నటిస్తున్నారు విజయ్ దేవరకొండ.

# మలయాళ దర్శకుడికి ఓకే చెప్పిన నాని

ప్రస్తుతం 'హిట్ 3' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు నాని. ఈ సినిమా తర్వాత శ్రీకాంత్ ఓదెల సినిమా ఉంటుంది. ఆ తర్వాత సుజిత్ సినిమా. ఇలా క్షణం తీరిక లేకుండా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు నాని. ఇంత బిజీలో కూడా ఆయన మరో దర్శకుడి కథకు ఓకే చెప్పినట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఆ దర్శకుడి పేరు విపిన్ దాస్. మలయాళంలో 'జయ జయ జయ హే', 'గురువాయూర్ అంబలనడయిల్' చిత్రాలతో మంచి విజయాలను అందుకున్న దర్శకుడు తను. తాజాగా ఆయన చెప్పిన కథ.. నానికి బాగా నచ్చడంతో ఆ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తున్నది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ సినిమాను నిర్మించనున్నట్టు సమాచారం. 2026లో ఈ సినిమాను సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంది.

## థియేటర్ దగ్గర స్టెప్పులేసిన

# పుష్ప యాక్టర్



పుష్ప ది రైజ్ సినిమాలో జాలిరెడ్డి పాత్రతో తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫేం సంపాదించాడు కన్నడ యాక్టర్ ధనుంజయ. కన్నడలో సూపర్ పాపులర్ అయిన ఈ టాలెంటెడ్ యాక్టర్ ఓ థియేటర్ ముందు అభిమానులతో కలిసి డ్యాన్స్ చేశాడు. ఇంతకీ స్పెషల్ ఏంటనే కదా మీ డౌటు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ నటించిన యాక్షన్ థ్రిల్లర్. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ స్క్రీనింగ్ సందర్భంగా బెంగళూరులోని నర్తకి థియేటర్ వద్ద ధనుంజయ అభిమానులతో కలిసి డ్యాన్స్ చేసిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ధనుంజయ ప్రస్తుతం సీక్వెల్ పుష్ప 2 ది రూల్‌లో నటిస్తుండగా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ధనుంజయ మరోవైపు సత్యదేవ్‌తో కలిసి నటిస్తోన్న చిత్రం జీబ్రా. ఈ మూవీ నవంబర్ 22న థియేటర్లలో సందడి చేయనుంది. శివ రాజ్ కుమార్‌కు తెలుగులో కూడా మంచి క్రేజ్ ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ యాక్టర్ రాంచరణ్ ఆర్‌సీ 16లో, విజయ్ దళపతి 69లో కీ రోల్స్‌లో నటిస్తున్నాడు.

# ఛాంపియన్స్ ట్రోఫీ టూర్ షెడ్యూల్ మార్పు



వచ్చే ఏడాది జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ టూర్ షెడ్యూల్‌లో ఐసీసీ మార్పులు చేసింది. ట్రోఫీ టూర్‌ను పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లో నిర్వహించడంపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో.. గ్లోబల్ బాడీ ఆఫ్ క్రికెట్ పీఓకేను చేర్చని సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ట్రోఫీ టూర్ ఇప్పుడు కరాచీ, రావల్పిండి, ఇస్లామాబాద్, ఖైబర్ పఖ్తుంక్వాలో జరుగనుంది. తాజాగా.. ఐసీసీ పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఐసీసీ తన 'గ్లోబల్ ట్రోఫీ టూర్'ని శనివారం ప్రకటించింది. ఇస్లామాబాద్‌లో టూర్ ప్రారంభం కానుందని ఐసీసీ పేర్కొంది. ట్రోఫీ టూర్ పాకిస్తాన్ రాజధాని నవంబర్ 16న ఇస్లామాబాద్‌లో ప్రారంభం కానుంది. నవంబర్ 17న తక్షిలా, ఖాన్‌పూర్.. నవంబర్ 18న అబోటాబాద్, నవంబర్ 19న ముర్రే, నవంబర్ 20న నథియా గలీ, నవంబర్ 22 నుండి 25న కరాచీలో ముగుస్తుంది. అంతకుముందు.. నవంబర్ 14న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) స్కర్డు, ముర్రీ, హుంజా, ముజఫరాబాద్ వంటి నగరాలలో ట్రోఫీ నిర్వహిస్తుందని ప్రకటించింది. కాగా.. భద్రతా సమస్యలపై టీమిండియా పాకిస్తాన్‌కు వెళ్లడం లేదన్న సంగతి తెలిసిందే..

ట్రోఫీ టూర్ యొక్క ముఖ్య తేదీలు:

16 నవంబర్ - ఇస్లామాబాద్, పాకిస్తాన్
17 నవంబర్ - తక్షిలా మరియు ఖాన్పూర్, పాకిస్తాన్
18 నవంబర్ - అబోటాబాద్, పాకిస్తాన్
19 నవంబర్- ముర్రే, పాకిస్తాన్
20 నవంబర్- నథియా గాలి, పాకిస్థాన్
22 - 25 నవంబర్ - కరాచీ, పాకిస్తాన్
26 - 28 నవంబర్ - ఆఫ్ఘనిస్తాన్
10 - 13 డిసెంబర్ - బంగ్లాదేశ్
15 - 22 డిసెంబర్ - దక్షిణాఫ్రికా
25 డిసెంబర్ - 5 జనవరి - ఆస్ట్రేలియా
6 - 11 జనవరి - న్యూజిలాండ్
12 - 14 జనవరి - ఇంగ్లండ్
15 - 26 జనవరి - భారతదేశం
27 జనవరి - ఈవెంట్ ప్రారంభం- పాకిస్తాన్

# తొలి టెస్టుకు శుభ్‌మన్ గిల్ దూరమయ్యే అవకాశాలు

సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూసిన భారత్ మరో టెస్టు సిరీస్ సమరానికి సిద్ధమవుతోంది. నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ ఆడనుంది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (2024-25)లో టీమిండియాకు ఇదే చివరి సిరీస్. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే రోహిత్ సేన ఈ సిరీస్ అత్యంత కీలకం. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కనీసం 4-0తో విజయం సాధిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా భారత్ ఫైనల్‌కు చేరుకోగలదు. మరోవైపు ఆస్ట్రేలియాకు ఈ సిరీస్ ఎంతో కీలకం కానుంది. శ్రీలంక సిరీస్‌తో కలిపి ఆడాల్సిన ఏడు మ్యాచ్‌ల్లో అయిదు విజయాలు సాధించాల్సి ఉంది. దీంతో సిరీస్ హొరాహొరీగా సాగడం ఖాయంగా అనిపిస్తోంది. అయితే ప్రాక్టీస్‌లో భారత ఆటగాళ్లకు వరుసగా గాయాలవుతున్నాయి. సిరీస్ ఆరంభం కాకముందే ఏకంగా ముగ్గురు స్టార్ ప్లేయర్లు గాయపడ్డారు. కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లిలకు గురువారం గాయాలైన విషయం తెలిసిందే. తాజాగా ఆ జాబితాలో శుభ్‌మన్ గిల్ కూడా చేరాడు. శుభ్‌మన్ గిల్ బొటనవేలు ఫ్రాక్చర్ అయ్యింది. స్లిప్‌లో క్యాచ్ పడుతుండగా గాయపడ్డాడు. స్కానింగ్ అనంతరం గిల్‌కు తీవ్రమైన గాయం అయినట్లు తెలుస్తోంది. నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా జరగనున్న తొలి టెస్టుకు అతను దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. "మ్యాచ్ సిమ్యులేషన్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా శుభ్‌మన్ గిల్ బొటనవేలుకు గాయమైంది. వైద్యసిబ్బంది సూచనల మేరకు స్కానింగ్ చేయగా బొటనవేలు ఫ్రాక్చర్ అయినట్లు తెలిసింది. తొలి టెస్టుకు అందుబాటులో ఉండటం దాదాపు కష్టమే. రెండో టెస్టు ప్రారంభ సమయానికి మాత్రం పూర్తిగా కోలుకోగలడు" అని సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతకుముందు కేఎల్ రాహుల్ గాయపడిన విషయం తెలిసిందే. ప్రసిధ్ కృష్ణ వేసిన బంతికి రాహుల్ మోచేతికి గాయమైంది. నొప్పి తీవ్రత, సుదీర్ఘ సిరీస్ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకొని కేఎల్ రాహుల్ మైదానాన్ని వీడాడు. మరోవైపు విరాట్ కోహ్లికి కూడా గాయమైందని ఆస్ట్రేలియా మీడియా పేర్కొంది. అంతేగాక మిస్టరీ గాయం కోసం కోహ్లి స్కానింగ్‌కు కూడా వెళ్లాడని రాసుకొచ్చింది. అయితే కోహ్లి బాగున్నాడని, అతని విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా, వ్యక్తిగత కారణాలతో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పెర్త్ టెస్టుకు దూరమవుతున్నాడని ప్రచారం సాగుతున్న వేళ కీలక ఆటగాళ్లు గాయాలపాలవ్వం టీమిండియా శిబిరంలో ఆందోళన కలిగిస్తోంది. రోహిత్ స్థానంలో కేఎల్ రాహుల్ బదులుగా గిల్‌ను ఓపెనర్‌గా పంపాలని సూచనలు వస్తున్న వేళ.. గిల్‌కు గాయమవ్వడం గమనార్హం. అయితే గురువారమే రితికా పండంటి మగబిడ్డక జన్మనివ్వడంతో రోహిత్ తొలి టెస్టుకు అందుబాటులో ఉండే అవకాశమూ ఉంది.

**ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ షెడ్యూల్**

**నవంబర్ 22-26: తొలి టెస్టు- పెర్త్ (ఉదయం 7.30)**

**డిసెంబర్ 06-10: రెండో టెస్టు (డే/నైట్)- అడిలైడ్ (ఉదయం 9.30)**

**డిసెంబర్ 14-18: మూడో టెస్టు- బ్రిస్బేన్ (ఉదయం 5.50)**

**డిసెంబర్ 26-31: నాలుగో టెస్టు- మెల్‌బోర్న్ (ఉదయం 5 గంటలకు)**

**జనవరి 03-08: అయిదో టెస్టు- సిడ్నీ (ఉదయం 5 గంటలకు).**